


RNI: TELTEL12215
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

ప్రచురణ :తెలంగాణ | సంపాదకులు :చెరుకు ఉపేందర్ | గురువారం - 22 - ఆగస్టు - 2024
సంపుటి 01, సంచిక 348, పేజీలు -4 వెల రూ.5/-



## నలభై ఐదేళ్ల తర్వాత పోలాండ్ లో పర్యటించనున్న తొలి భారత ప్రధానిగా మోదీ

చివరిసారిగా 1979 లో ఆ దేశానికి వెళ్లిన మొరార్జీ దేశాయ్

2లో



## సెక్షన్ 306ను అమలు చేయాలంటే ఆత్మహత్యకు పురికొల్పినట్లు ఆధారాలుండాలి



2

## హసీనాను విచారించాలి.. మాకు అప్పగించండి

భారత్ కు బంగ్లా పార్టీ డిమాండ్

బంగ్లా మాజీ ప్రధానికి భారత్ ఆశ్రయమివ్వడం విచారకరమని వ్యాఖ్య

## దేవుళ్లపై ఒట్లు వేసి మరీ మాట తప్పారు



2లో

- రేవంత్ రెడ్డి పాలనలాగే కేసీఆర్ పాలన సాగుతోంది: కిషన్ రెడ్డి
- ఎన్నికల హామీలకు కాంగ్రెస్ తూట్లు పొడుస్తోందని విమర్శ
- రుణమాఫీని సీఎం గందరగోళంగా మార్చివేశారని ఆగ్రహం

# ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం భూ సేకరణ ప్రారంభించండి



- భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారం అందించండి
- ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలి
- ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి - ఆమన్‌గల్ - షాద్‌నగర్ - చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలి

హైదరాబాద్ : రీజినల్ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్) ప్రగతిపై కలెక్టర్లు ఏం చేస్తున్నారు పనుల పురోగతి ఏంటనే దానిపై రోజువారీ సమీక్ష చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నతాధికారులను ఆదేశించారు. భూ సేకరణ, ఇతర విషయాలపై ఎప్పటికప్పుడు అప్‌డేట్ సమాచారం తనకు అందజేయాలన్నారు. ఆర్ఆర్ఆర్ ప్రగతిపై రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బుధవారం సమీక్ష నిర్వహించారు. ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలో భూ సేకరణ, పనులకు మిగతా..2లో



## రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకం

రేపటి రైతుల ధర్నాలు మొదటి అడుగు మాత్రమే..

రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలి

ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు

ప్రజల దృష్టి మళ్లించేందుకు బజారు భాష..

హైదరాబబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకమని.. రుణమాఫీ మొత్తం దగా, మోసమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రుణమాఫీ విషయంలో ప్రభుత్వం చెబుతున్నవి అర్ధసత్యాలు, అసత్యాలన్నారు. మిగతా..2లో

## కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దొంగ నాటకాలు ఆడుతున్నాయి



2లో

- కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం కాబోతోంది..
- బీఆర్ఎస్ రాజ్యసభకు ఎందుకు పోటీ చేయడం లేదు..
- మాకు 39 మంది ఎమ్మెల్యేలు ఉంటే పోటీ చేసే వాళ్లం
- కాంగ్రెస్ అభ్యర్థి.. బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థి. కాంగ్రెస్ లో కేసీఆర్ ఆడిందే ఆట పాడిందే పాట
- కేంద్ర మంత్రి సంచలన వ్యాఖ్యలు

## ప్రగతి భవన్ (ఇప్పుడు ప్రజాభవన్) గేట్ల ముందు పడిగాపులు పడేలా

### ఆహంకారమా? .. కుంగుబాటా?



హైదరాబాద్ :గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో పరాజయం బీఆర్ఎస్ కు మరీ ముఖ్యంగా ఆ పార్టీ అధినేతకు భారీ షాక్ అనే చెప్పాలి. తెలంగాణలో తన మాటకు తిరుగులేదు అన్న రీతిలో పదేళ్ల పాటు రాష్ట్రాన్ని తన నోటి మాటతో, కను సైగతో శాశించిన కేసీఆర్ ఆ ఓటమి తరువాత సైలెంట్త్రైపోయారు. ఒక వేళ అయనా మాట్లాడినా పట్టించుకునే వారూ, లెక్క చేసే వారూ లేకుండా పోయారు.

# విశాఖ ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ప్రమాణం

- మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన చాంబర్‌లో బొత్సచేత ప్రమాణం
- ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలి
- రాబోయే కాలంలో విశాఖను,ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతా



అమరావతి : వైసీపీ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ బుధవారం స్థానిక సంస్థల ఎమ్మెల్సీ గా ప్రమాణం చేశారు. మండలి చైర్మన్ కొయ్యే మోషెన్‌రాజు తన చాంబర్‌లో బొత్సచేత ప్రమాణం చేయించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు. శాసనసభ, శాసన మండలిలో ప్రజల కోసం నిలబడతామని , ప్రజా సమస్యలను మండలి దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ప్రజలకిచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం అమలు చేయాలని కోరారు. పార్టీ అధిష్టానం మేరకు బాధ్యతయుతంగా ప్రజల తరుపున మండలి లో చిత్తశుద్ధితో పోరాటం చేస్తానని వెల్లడించారు. రాబోయే కాలంలో విశాఖను,ఉత్తరాంధ్రను అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతానని వెల్లడించారు. ప్రస్తుతానికి వైసీపీ పార్టీది మిగతా..2లో



## జనవరి నుంచి జన్మభూమి 2.0

- ముందుకు వచ్చే వారితో కలిసి గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలు
- ఐదేళ్లలో 17,500 కి.మీ మేర సీసీ రోడ్లు, 10,000 కి.మీ డ్రైనేజ్ కాల్వలు నిర్మిస్తాం
- పంచాయతీరాజ్‌కు ఇవ్వాల్సిన రూ.990 కోట్లు వెంటనే విడుదల చేస్తాం: సీఎం చంద్రబాబు

## ఓటుకు నోటు కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పునే

# సమర్థించిన సుప్రీంకోర్టు

ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి భారీ ఊరట

అమరావతి: ఓటుకు నోటు కేసులో ఏపీ సీఎం చంద్రబాబు నాయుడికి భారీ ఊరట లభించింది. ఓటుకు నోటు కేసులో చంద్రబాబును నిందితుడిగా చేర్చాలని, ఈ కేసును సీబీఐకి అప్పగించాలని మంగళగిరి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత ఆళ్ల రామకృష్ణా రెడ్డి వేసిన రెండు పిటిషన్లను సుప్రీంకోర్టు తిరస్కరించింది. ఆళ్ల రామకృష్ణారెడ్డి వేసిన పిటిషన్లను జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ అరవింద్‌కుమార్ ధర్మాసనం బుధవారం విచారణ జరిపింది. ఆర్కే తరఫున న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. ఫోన్ మాట్లాడుతూ చంద్రబాబు రెడ్ హ్యాండెడ్‌గా దొరికిపోయారని.. ఆయనకు సంబంధించిన కాల్ రికార్డ్స్ ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీకి ఓటేస్తే రూ.5కోట్లు ఇస్తానని, అదే గైర్హాజరైతే రూ.2 కోట్లు ఇస్తానని రేవంత్ రెడ్డితో బేరసారాలు జరిపించారని పేర్కొన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం.. గతంలో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించింది.



2లో

రాజకీయ కక్ష సాధింపులకు న్యాయస్థానాన్ని వేదికగా మార్చుకోవద్దంటూ ఆర్కేను సుప్రీంకోర్టు మందలించింది.

ఆధార రహిత అంశాలను తీసుకొచ్చి కోర్టుతో ఆటలాడుకోవద్దని హెచ్చరించింది.

## ప్రభుత్వంపై ప్రతినెలా రూ.260 కోట్ల వరకు అదనపు భారం!



2లో

- ఏపీలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం..
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై సిద్ధమైన నివేదిక
- అదనంగా 2వేల బస్సులు, 3500 మంది డ్రైవర్లు అవసరమన్న అధికారులు

RNI: TELTEL12215
ప్రభాత సూర్యుడు
నిజం దాగదు.. వార్త ఆగదు · జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com



## నలభై ఐదేళ్ల తర్వాత పోలాండ్ లో పర్యటించనున్న తొలి భారత ప్రధానిగా మోదీ

ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ రెండు రోజుల పర్యటన కోసం పోలాండ్ బయలుదేరారు. ఇరుదేశాల మధ్య సంబంధాలు మెరుగుపర్చుకోవడమే ఈ పర్యటన ఉద్దేశమని విదేశాంగ శాఖ వెల్లడించింది. ఈ పర్యటనతో ప్రధాని మోదీ మరో రికార్డును సృష్టించారు. 45 ఏళ్ల తర్వాత పోలాండ్ లో పర్యటించనున్న తొలి భారత ప్రధానిగా మోదీ నిలవనున్నారు. చివరిసారి 1979లో నాటి భారత ప్రధాని మొరార్జీ దేశాయ్ పోలాండ్ లో పర్యటించారు. ఆ తర్వాత ఇప్పటి వరకూ భారత ప్రధానులు ఎవరూ కూడా ఆ దేశానికి వెళ్లలేదు. ఈ పర్యటనలో వివిధ కీలక అంశాలలో భాగస్వామ్యం, రక్షణ రంగంలో పరస్పర సహకారం తదితర అంశాలపై పోలాండ్ అధ్యక్షుడితో మోదీ చర్చించనున్నారని తెలిపింది. ఉక్రెయిన్ రష్యా యుద్ధ సమయంలో భారత విద్యార్థులకు పోలాండ్ సాయం చేసింది. ఉక్రెయిన్ నుంచి సుమారు 4 వేల మంది భారత విద్యార్థులు పోలాండ్ లోకి అడుగుపెట్టి, అక్కడి నుంచి విమానాల్లో స్వదేశానికి వచ్చిన విషయం తెలిసిందే. అదేవిధంగా, రెండో ప్రపంచ యుద్ధ సమయంలో దాదాపు 6 వేల మంది పోలిష్ మహిళలు, చిన్నారులకు భారత భూభాగంలో ఆశ్రయం కల్పించారు. కాగా, పోలాండ్ పర్యటన ముగించుకుని ఈ నెల 23న ప్రధాని మోదీ ఉక్రెయిన్ కు వెళ్లనున్నారు. ఉక్రెయిన్ రాజధాని కీవ్ లో ఆ దేశ ప్రెసిడెంట్ వొలొదిమిర్ జెలెన్ స్కీ తో చర్చలు జరపనున్నారు.

## సెక్షన్ 306ను అమలు చేయాలంట ఆత్మహత్యకు పురికొల్పినట్టు ఆధారాలుండాలి

ఢిల్లీ: ఓ వ్యక్తి ఆత్మహత్యకు సంబంధించి సుప్రీంకోర్టు కీలక తీర్పు వెలువరించింది. భారతీయ శిక్షా స్మృతిలోని సెక్షన్ 306 ప్రకారం ఆత్మహత్యకు ప్రేరేపించే నిబంధన అమలు చేయాలంటే నిందితుడు బాధిత వ్యక్తిని ఆత్మహత్యకు పురికొల్పి ఉండడమో, ఇతరులతో కలిసి కుట్రలో పాలుపంచుకోవడమో, లేదంటే నేరం చేసిన వ్యక్తికి ఉద్దేశపూర్వకంగా సాయం చేసి ఉండడమో చేయాలని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. తన భర్త ఆత్మహత్య విషయంలో తనపై నమోదైన కేసును కొట్టివేయడం కుదరదంటూ ట్రయల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలంటూ రోహిణి సుదర్శన్ గంగుర్దే బాంబే హైకోర్టును ఆశ్రయించారు. హైకోర్టు కూడా ఈ ఆదేశాలను సమర్థించడంపై ఆమె సుప్రీంకోర్టును ఆశ్రయించారు. ఈ పిటిషన్‌ను విచారణకు అనుమతించిన జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సతీశ్ చంద్రశర్మలతో కూడిన ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. కేసు పూర్వాపరాల్లోకి వెళ్తే.. ఓ ఆసుపత్రిలో సామాజిక సేవా సూపరింటెండెంట్‌గా పనిచేసిన 38 ఏళ్ల సుదర్శన్ గంగుర్దే 17 ఫిబ్రవరి 2020న శింగనాపూర్‌లోని తన ఇంట్లో ఉరేసుకుని చనిపోయాడు. మానసికంగా, శారీరకంగా వేధించడం, కొట్టడం వల్లే అతడు ఆత్మహత్య చేసుకున్నాడన్న సుదర్శన్ తల్లి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు. ఇరు కుటుంబాలకు ఇష్టం లేకున్నా సుదర్శన్ 2015లో ప్రేమ వివాహం చేసుకున్నాడు. వీరికి మగబిడ్డ కూడా జన్మించాడు. ఆ తర్వాత ఉమ్మడిగా వారు ఓ ఇల్లు కూడా కొనుగోలు చేశారు. ఆ ఇంటిని తన పేరున మార్చమని భార్య బాధితుడిని వేధించిందని, అతడి ఆత్మహత్యకు అదే కారణమని పోలీసులు చార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. అయితే, ఆ ఆరోపణల్లో నిజం లేదని, భర్తను ఆత్మహత్యకు పురికొల్పేలా చేసినట్టు ఆధారాలు లేవని రోహిణి వాదించింది. తాముండే ఇంటిని ఉమ్మడిగా కొనుగోలు చేయడంతో దానిని తన పేరున బదిలీ చేయాలని బలవంతం చేశామన్న ప్రశ్నే లేదని పేర్కొంది. అయితే, సాక్ష్యాలు ఆమెకు వ్యతిరేకంగా ఉన్నాయని అభిప్రాయపడిన హైకోర్టు ఆమె పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో రోహిణి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా ఈ కేసును విచారించిన సర్వోన్నత న్యాయస్థానం హైకోర్టు ఆదేశాలను కొట్టివేసింది. మరణించిన వ్యక్తి వైవాహిక జీవితంలో ఎలాంటి వివాదాలు లేవని, ఆయన ఆత్మహత్యకు, వైవాహిక బంధానికి మధ్య ఎలాంటి సన్నిహిత సంబంధం లేదని స్పష్టం చేసింది. భర్తను ఆత్మహత్యకు ప్రేరేపించినట్టు నిరూపించే ఎలాంటి ఆధారాలు లేవని పేర్కొంది.

## హసీనాను విచారించాలి.. మాకు అప్పగించండి

బంగ్లాదేశ్ : బంగ్లాదేశ్ లో విద్యార్థులు, ప్రజల ఆందోళనల కారణంగా ప్రధాని పదవికి రాజీనామా చేసిన షేక్ హసీనా.. దేశం విడిచిపెట్టి భారత్ లో ఆశ్రయం పొందుతున్న విషయం తెలిసిందే. అయితే, హసీనాకు ఆశ్రయమివ్వడంపై భారత్ ను బంగ్లా నేషనలిస్ట్ పార్టీ (బీఎన్ పీ) విచారం వ్యక్తం చేసింది. బంగ్లాదేశ్ ప్రజల విజయాన్ని అడ్డుకోవడానికి హసీనా భారత్ నుంచి కుట్ర చేస్తున్నారని ఆరోపించింది. ఆమెను వెంటనే తమకు అప్పగించాలని భారత ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. రిజర్వేషన్ల అంశంపై చెలరేగిన ఆందోళనలలో విద్యార్థులతో పాటు బీఎన్ పీ పార్టీ కూడా కీలకంగా వ్యవహరించింది. ఈ క్రమంలోనే ఆందోళనలలో పలువురు ప్రాణాలు పోగొట్టుకోవడం, వారి మరణానికి కారణం మాజీ ప్రధాని హసీనా, ఆమె అనుచరులేనని ఫిర్యాదులు వెల్లువెత్తాయి. దీంతో హసీనాపై రెండు హత్యలతో పాటు 31 కేసులు నమోదయ్యాయి. వాటికి సంబంధించి హసీనాను విచారించాల్సి ఉందని, న్యాయబద్ధంగా ఆమెను బంగ్లాదేశ్ కు అప్పగించాలని బీఎన్‌పీ పార్టీ సెక్రటరీ జనరల్ మీర్జా ఫఖ్రుల్ ఇస్లామ్ ఆలంగిర్ కోరారు.


## దేవుళ్లపై ఒట్లు వేసి మరీ మాట తప్పారు

హైదరాబాద్: రేవంత్ రెడ్డి పాలన కేసీఆర్ పాలనలాగే సాగుతోందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. బుధవారం సికింద్రాబాద్‌లో జరిగిన బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి హాజరైన ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ నేతలు చెప్పినట్లుగా రైతులకు రుణమాఫీ కాలేదని విమర్శించారు. ఎన్నికల హామీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తూట్లు పొడుస్తోందన్నారు. రుణమాఫీని సీఎం అంతా గందరగోళంగా మార్చివేశారన్నారు. దేవుళ్లపై ఒట్లు వేసి మరీ మాట తప్పారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కనీసం సగం మంది రైతులకు కూడా రుణమాఫీ కాలేదన్నారు. రుణమాఫీకి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వం ప్రజల ముందు ఉంచాలని డిమాండ్ చేశారు. ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. ఆరు గ్యారెంటీలను అమలు చేసే వరకు ప్రజలతో కలిసి ఉద్యమిస్తామన్నారు. వ్యక్తులు, కుటుంబాల కోసం నడిచే పార్టీ బీజేపీ కాదన్నారు. బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రావడమే తమ లక్ష్యమన్నారు. బీజేపీ అధికారంలోకి రావాలని ప్రజలే కోరుకుంటున్నట్లు చెప్పారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా ముందుకు వెళ్తామన్నారు. సెప్టెంబర్ 17ను తెలంగాణ ముక్తి దివస్‌గా ఘనంగా నిర్వహిస్తామన్నారు. పార్లమెంట్ ఎన్నికల స్ఫూర్తితో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కుటుంబాల కోసం అవినీతికి పాల్పడుతున్న పార్టీలను తరిమి కొట్టాలన్నారు.

## ప్రభుత్వంపై ప్రతినెలా రూ.260 కోట్ల వరకు అదనపు భారం!

అమరావతి: ఏపీలో ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై కసరత్తు జరుగుతోంది. ఈ విషయమై అధికారుల కమిటీ తాజాగా నివేదికను సిద్ధం చేసింది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తే రద్దీ పెరుగుతుందని, అదనంగా బస్సులు కొనుగోలు చేయాల్సి ఉంటుందని అధికారులు నివేదికలో పేర్కొన్నారు. అదే సమయంలో ఖాళీగా ఉన్న డ్రైవర్ పోస్టులను కూడా భర్తీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉచిత బస్సు ప్రయాణం అమలుచేస్తే అదనంగా 2వేల కొత్త బస్సులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ప్రస్తుతం ఆర్టీసీలో 10వేల బస్సులు ఉన్నాయి. వాటిలో సొంత బస్సులు 8,220. మిగిలినవి అద్దె బస్సులు. కొంతకాలం కిందట 1,480 కొత్త బస్సులు కొనుగోలు చేశారు. అటు చాలాకాలంగా ఆర్టీసీలో ఉద్యోగ నియామకాలు లేకపోవడం, అదే సమయంలో పదవీ విరమణలు జరగడంతో ఆర్టీసీలో డ్రైవర్ల కొరత ఏర్పడింది. అందుకే కొత్తగా 3,500 మంది వరకు డ్రైవర్ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని అధికారులు తమ వేదికలో పేర్కొన్నారు. ఇక మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తే ఆర్టీసీ నెలకు రూ.250 నుంచి రూ.260 కోట్ల వరకు ఆదాయం కోల్పోవాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఆర్టీసీకి ప్రతినెలా వచ్చే ఆదాయంలో 25 శాతం వరకు అంటే రూ.125 కోట్ల వరకు ప్రభుత్వానికి వెళ్తోంది. ఇకపై ఆ మొత్తంతో పాటు మిగిలిన రూ.125 నుంచి రూ.135 కోట్లను అదనంగా సర్కారే భరించాల్సి ఉంటుంది. కాగా, గత ఎన్నికల్లో కూటమి ప్రధాన హామీల్లో ఒకటైన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఇవాళ సమీక్ష నిర్వహించనున్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఆర్టీసీ అధికారులు కర్ణాటక, తెలంగాణలో ఉచిత ప్రయాణంపై అధ్యయనం చేసిన వివరాలను తెలియజేయనున్నారు. వాటి ఆధారంగా రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేస్తే కలిగే లోటుపాట్లను సీఎం అధికారులతో చర్చించి దిశానిర్దేశం చేయనున్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దొంగ నాటకాలు ఆడుతున్నాయి



హైదరాబాద్: బీజేపీలో చేరి, పార్టీకి మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేస్తున్నామని కేంద్ర మంత్రి బండి సంజయ్ అన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ లు దొంగ నాటకాలు ఆడుతున్నాయని ఆరోపించారు. తెలంగాణ సమాజానికి పూర్తిగా స్పష్టత వచ్చిందన్నారు. కాంగ్రెస్ లో బీఆర్ఎస్ విలీనం కాబోతుందని ఆరోపించారు. బండి సంజయ్ మాట్లాడుతూ.. "కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థి కేసీఆర్ కూతురు బెయిల్ కోసం వాదనలు వినిపించిన వ్యక్తి.. కేసీఆర్ సూచనల మేరకే ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించారు. బీఆర్ఎస్ రాజ్యసభకు ఎందుకు పోటీ చేయడం లేదు.. మాకు 39 మంది ఎమ్మెల్యేలు ఉంటే పోటీ చేసే వాళ్లం. కాంగ్రెస్ అభ్యర్థి.. బీఆర్ఎస్-కాంగ్రెస్ పార్టీల ఉమ్మడి అభ్యర్థి. కాంగ్రెస్ లో కేసీఆర్ ఆడిందే అట పాడిందే పాట. అతి త్వరలోనే కాంగ్రెస్ లో విలీనం ఖాయం డిల్లీలో ఒప్పందం జరిగింది. ప్లాన్ ప్రకారం బీజేపీ ని బ్లేమ్ చేస్తున్నారు. " అని ఆయన వ్యాఖ్యానించారు. విగ్రహాల దందా బంద్ చేయాలన్నారు. సమస్యలను డైవర్ట్ చేయడానికి.. విగ్రహాల రాజకీయాల చర్చ చేస్తున్నారన్నారు. ఫార్మ్ హౌస్ మీద డ్రోన్ తో విజువల్ తీశారని కేటీఆర్ కేసు రేవంత్ రెడ్డి మీద ఎందుకు పెట్టారని ప్రశ్నించారు. ఆయన ఫార్మ్ హౌస్ కాకుంటే కేసు ఎందుకు పెట్టినట్టు అన్నారు. మహారాష్ట్ర , హర్యానా ఎన్నికలకి డబ్బులు పంపించాలి.. కాబట్టే హైడ్రా పేరు మీద డ్రామా ఆడుతున్నారని ఆరోపించారు. కాగా..తాజాగా జన్వాడ ఫాం హౌస్ పై హైకోర్టులో విచారణ ప్రారంభమైంది. ఓఆర్ఆర్ పరిధిలో హైడ్రా పనిచేస్తుందని ప్రభుత్వ తరఫు న్యాయవాది కోర్టుకు వివరించారు. ప్రభుత్వ భూములు, చెరువులు, నాలాల పరిరక్షణ హైడ్రా విధి అని పేర్కొన్నారు. జీహెచ్ఎంసీతో కలిసి హైడ్రా పనిచేస్తుందని తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ని నోటీసులు ఇచ్చిందని హైకోర్టు ప్రశ్నించింది. కేవలం తనిఖీల కోసమే హైడ్రా అక్కడికి వెళ్ళిందని లాయర్ చెప్పారు. నిబంధనల మేరకే హైడ్రా పనిచేస్తుందన్నారు. కేసు విచారణను ముగించండి.. నిబంధనల మేరకే వ్యవహరిస్తామని అడిషనల్ అడ్వకేట్ జనరల్ తెలిపారు.

# విశాఖ ఎమ్మెల్సీగా బొత్స సత్యనారాయణ ప్రమాణం

మొదటి పేజి తరువాయి



ప్రస్తుతానికి వైసీపీ పార్టీది మూడు రాజధానుల విధానమేనని అన్నారు. అంతకు ముందు బొత్స వైఎస్ జగన్‌ను కలిసి ఎంతో నమ్మకంతో ఎమ్మెల్సీ పదవి అవకాశం ఇచ్చినందుకు వైసీపీ అధినేత వైఎస్ జగన్ ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట మాజీ మంత్రి అమర్నాథ్, వైసీపీ నాయకులున్నారు. గత మూడు నెలల క్రితం ఖాళీ అయిన ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికలు నిర్వహించగా బొత్స సత్యనారాయణతో పాటు మరొక స్వతంత్ర అభ్యర్థి రహీమ్ నామినేషన్ వేశారు. స్వతంత్ర అభ్యర్థి తన నామినేషన్‌ను ఉపసంహరించుకోవడంతో బొత్స సత్యనారాయణ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

అధికార నేషనల్ డెమోక్రటిక్ అలయన్స్ (ఎన్‌డిఏ) తమ అభ్యర్థిని నిలబెట్టకపోవడంతో శుక్రవారం ఆయన పోటీ లేకుండానే విజేతగా ప్రకటించారు. స్వతంత్ర అభ్యర్థి షేక్ షఫీవుల్లా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ, ఆ తర్వాత ఆయన తన పేరును పోటీ నుండి ఉపసంహరించుకోవడంతో సత్యనారాయణ ఏకగ్రీవంగా విజయం సాధించారు. ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో (అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలతో కూడిన) వైకాపా బలమైన పట్టు కారణంగా, టీడీపీ దాని మిత్రపక్షాలు, జనసేన, బీజేపీ పోటీకి దూరంగా ఉన్నాయి. మొత్తం 836 ఓట్లకు గాను వైఎస్సార్‌సీపీకి 530కి పైగా ఓట్లు పోలయ్యాయి. చెన్నుబోయిన శ్రీనివాసరావుపై అనర్హత వేటు వేయడంతో ఖాళీ అయిన స్థానానికి ఆగస్టు 30న ఉప ఎన్నిక జరగాల్సి ఉంది. శ్రీనివాసరావు అసలు పేరు వంశీకృష్ణ యాదవ్, వైసీపీని వీడి జనసేన పార్టీలో చేరిన తర్వాత ఫిరాయింపుల నిరోధక చట్టం కింద మార్చిలో మండలి చైర్మన్ ఎమ్మెల్సీగా అనర్హుడయ్యారు. శ్రీనివాసరావు మే 13న జరిగిన ఎన్నికల్లో విశాఖపట్నం దక్షిణ నియోజకవర్గం నుంచి జనసేన టిక్కెట్‌పై అసెంబ్లీకి ఎన్నికయ్యారు. కౌన్సిల్ భవనంలోని తన ఛాంబర్‌లో మండలి చైర్మన్ కె.మోషేను రాజు సత్యనారాయణతో ప్రమాణం చేయించారు. ప్రమాణస్వీకారానికి ముందు మాజీ మంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి ఎమ్మెల్సీగా గెలిచినందుకు అభినందనలు తెలిపారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయంలో జగన్‌మోహన్‌రెడ్డిని సత్యనారాయణ పిలిపించి కృతజ్ఞతలు తెలిపారు.

# ట్రిపుల్ ఆర్ దక్షిణ భాగం భూ సేకరణ ప్రారంభించండి

మొదటి పేజి తరువాయి

సంబంధించిన వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి తెలియజేశారు. భూ సేకరణ వేగం పెరగాలని, ఆర్ఆర్ఆర్ ఉత్తర భాగంలోని కలెక్టర్లు ఈ రహదారి విషయంలో రోజు వారీగా ఏం చేశారు..? ఏం పురోగతి సాధించారు..? దక్షిణ భాగంలో భూ సేకరణ ప్రక్రియ ప్రారంభం, ఇతర అంశాలపై ఆయా జిల్లాల కలెక్టర్లు ప్రతి రోజు సాయంత్రానికి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వివరాలు అందజేయాలన్నారు. భూ సేకరణలోనూ పారదర్శకంగా వ్యవహరించాలన్నారు. సీఎస్‌తో పాటు మౌలిక వసతులు, ప్రాజెక్టుల సలహాదారు శ్రీనివాసరాజు, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆయా జిల్లాల కలెక్టర్లు, ఆర్ అండ్ బీ ఉన్నతాధికారులతో వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేసి ఎప్పటికప్పుడు పనుల పురోగతిని అందులో అప్‌డేట్ చేయాలని సూచించారు. ఒక సమీక్ష సమావేశానికి మరో సమీక్ష సమావేశానికి మధ్య కాలంలో పురోగతి తప్పనిసరిగా ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆర్ఆర్ఆర్ దక్షిణ భాగం సంగారెడ్డి - ఆమన్‌గల్ - షాద్‌నగర్ - చౌటుప్పల్ (189.20 కి.మీ.) మార్గానికి సంబంధించి భూ సేకరణ ప్రారంభించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. ఉత్తర భాగంలో ఇప్పటికే భూ సేకరణ చాలా వరకు పూర్తయినందున, దక్షిణ భాగంలోనూ ప్రారంభించాలన్నారు. ఈ రోడ్డు విషయంలో ఏవైనా సాంకేతిక, ఇతర సమస్యలుంటే కేంద్ర ప్రభుత్వంతో చర్చించాలని, అదే సమయంలో పనుల విషయంలో ముందుకు సాగాలని ముఖ్యమంత్రి సూచించారు. ఆర్ఆర్ఆర్ మొత్తం మ్యాప్‌ను గూగుల్ మ్యాప్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. దక్షిణ భాగం ప్రతిపాదిత అలైన్‌మెంట్‌లో కొన్ని మార్పుచేర్పులను ముఖ్యమంత్రి సూచించారు. భవిష్యత్ అవసరాలే ప్రాతిపదికగా అలైన్‌మెంట్ ఉండాలని, ఈ విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలని ముఖ్యమంత్రి అన్నారు. తాను సూచించిన మార్పులకు సంబంధించి క్షేత్ర స్థాయిలో పర్యటించి సమగ్ర నివేదికను త్వరగా అందజేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఫ్యూచర్ సిటీకి సంబంధించి రేడియల్ రోడ్ల నిర్మాణంపైనా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారుల నిర్మాణానికి ముందే ఎక్కడెక్కడ అవి ప్రధాన రోడ్లకు అనుసంధానం కావాలి. సిగ్నల్, ఇతర సమస్యలు లేకుండా సాఫీగా ప్రయాణం సాగేందుకు వీలుగా నిర్మాణాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రేడియల్ రోడ్లు, ఓఆర్ఆర్, ఆర్ఆర్ఆర్‌ల అనుసంధానానికి అనువుగా ఉండాలని, ఫ్యూచర్ సిటీలో ఏర్పాటుకానున్న వివిధ రకాల పరిశ్రమలు, సంస్థలకు ఉపయోగకరంగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఆర్ అండ్ బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నల్గొండ ఎంపీ కుందూరు రఘువీర్ రెడ్డి, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, రవాణా శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి వి.శేషాద్రి, ముఖ్యమంత్రి ఓఎస్డీ షానవాజ్ ఖాసీం, ఆర్ అండ్ బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన పాల్గొన్నారు

## రూ.2 లక్షల రుణమాఫీ హామీ బూటకం

మొదటి పేజి తరువాయి

రుణమాఫీ Loan waiver కాదని.. రైతులకు కుచ్చు టోపీ అని మండిపడ్డారు. రూ.2 లక్షలు రుణమాఫీ చేశామని మంత్రి తుమ్మల చెప్పారు. రుణమాఫీపై ఉత్తర కుమార ప్రగల్భాలు పలుకుతున్నారని.. రుణమాఫీపై రైతులకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రైతులు ఆగ్రహంతో రగిలిపోతున్నారని కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ జరగక రైతులు రోడ్డెక్కుతున్నరు.. ఏ పత్రిక, ఛానల్ చూసినా ఇవే వార్తలు కనిపిస్తున్నాయి. ఆందోళన చేస్తున్న రైతులపై ఏడేళ్లు, రెండేళ్లు శిక్షలు పడే కేసులు పెడుతూ మరోవైపు అందరికి రుణమాఫీ అయిందని సీఎం సంబరాలు చేసుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. రూ.31 వేల కోట్లు మాఫీ చేశామని సీఎం చెబుతున్నారు. రుణమాఫీపై మంత్రులు తలోమాట మాట్లాడుతున్నారు. సాంకేతిక కారణాలతో మాఫీ కాలేదని మంత్రులు చెబుతున్నారు. భట్టి చెప్పిన లెక్కలు వింటే రుణమాఫీ వట్టిదేనని తేలిపోయింది. మాఫీ ఎట్లా ఎగ్గొడదామని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తుగడలు వేస్తుందని.. అసలు రుణమాఫీపై ప్రభుత్వానికి స్పష్టత ఉందా..? లేదా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. మాఫీ 30 శాతం, కాంగ్రెస్ మోసం 100 శాతమన్న ఆయన ఇది రైతు స్వరాజ్యం కాదు.. ఏడిపిస్తున్న రాజ్యమని ధ్వజమెత్తారు. రుణమాఫీ విషయంలో ప్రభుత్వ తీరును ఎండగడుతూ.. రేపు అన్ని మండల కేంద్రాల్లో రైతుల ధర్నాలు ఉంటాయి. రేపటి ఆందోళనలు మొదటి అడుగు మాత్రమే. రైతులపై కేసులు ఉపసంహరించుకోవాలి. రుణమాఫీ చేయనందుకు ప్రభుత్వం క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం వ్యాఖ్యలకు నిరసనగా తెలంగాణ తల్లి విగ్రహానికి పాలాభిషేకాలు చేస్తామని కేటీఆర్ వెల్లడించారు. ఎప్పటిలోగా రుణమాఫీ పూర్తి చేస్తారో చెప్పాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఎలాంటి ఆంక్షలు లేకుండా బీఆర్ఎస్ ఉన్నంతకాలం రైతులకు అండగా ఉంటుందని, రైతులు స్థైర్యం కోల్పోవద్దని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

ప్రజల దృష్టి మళ్లించేందుకు బజారు భాష..

పచ్చి మోసగాళ్ల ప్రభుత్వం ఇదని.. 49 వేల కోట్ల వ్యవసాయ రుణాలున్నాయని చెప్పింది మీరా..కాదా..? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించిన కేటీఆర్.. ప్రభుత్వం రుణమాఫీ పేరుతో కేవలం రూ.7500 కోట్లతో సరిపెట్టాలని చూస్తున్నట్టుందన్నారు. లక్షల మంది రైతులను మోసం చేసిన ఈ ప్రభుత్వాన్ని ఏం చేయాలి..? సీఎం తడిగుడ్డతో రైతుల గొంతు కోసిండు. ప్రజల దృష్టి మళ్లించేందుకు సీఎం రేవంత్ బజారు భాష మాట్లాడుతున్నారు. కేసీఆర్‌ను తిడితే సంబరపడే కొన్ని మీడియా సంస్థలున్నాయి. మొత్తం రుణమాఫీ చేసే వరకు ప్రభుత్వాన్ని వెంటాడుతామని కేటీఆర్ హెచ్చరించారు. జన్వాడ ఫామ్‌హౌజ్ వ్యవహారం నేపథ్యంలో తనకు ఫామ్‌హౌజ్ లేదని.. మిత్రుడి ఫామ్‌హౌజ్ లీజుకు తీసుకున్నానని కేటీఆర్ స్పష్టం చేశారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉంటే నేనే కూల్చేయిస్తా. కాంగ్రెస్ మంత్రుల ఫామ్‌హౌజ్‌లే ఎఫ్‌టీఎల్‌లో ఉన్నాయి. వీ6 వివేక్ ఫామ్‌హౌజ్ కూడా నీళ్లలోనే ఉంది. మంత్రుల ఫామ్‌హౌజ్‌ల నుంచే కూల్చివేతలు ప్రారంభిద్దామని కేటీఆర్ సూచించారు.

## ఓటుకు నోటు కేసులో హైకోర్టు ఇచ్చిన తీర్పునే సమర్థించిన సుప్రీంకోర్టు

మొదటి పేజి తరువాయి

పిటిషనర్‌కు రాజకీయాలతో ఉన్న అనుబంధంపై ఈ సందర్భంగా ధర్మాసనం ఆరా తీసింది. ఓటుకు నోటు వ్యవహారంలో సుప్రీంకోర్టులో వేరే కేసులు కూడా ఉన్నాయని రామకృష్ణారెడ్డి తరఫు న్యాయవాది జాబితా ఇచ్చారు. కాగా ఆ కేసులకు ఇప్పుడు వాదనలు జరుగుతున్న కేసులకు సంబంధం లేదని సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా తెలిపారు. కేసుల జాబితా చూసిన తర్వాత పిటిషనర్‌పై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కేసులో జోక్యం చేసుకోవడానికి ఎలాంటి అంశాలు కనిపించడం లేవని స్పష్టంచేసింది.

## జనవరి నుంచి జన్మభూమి 2.0

అమరావతి: జన్మభూమి 2.0 కార్యక్రమాన్ని వచ్చే ఏడాది జనవరి నుంచి ప్రారంభించనున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. రాష్ట్ర సచివాలయంలో మంగళవారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణం, అటవీ శాఖలపై సమీక్ష నిర్వహించారు. పంచాయతీరాజ్ శాఖలో తీసుకున్న పలు నిర్ణయాలను సంబంధిత శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ వివరించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'జన్మభూమి 2.0 కార్యక్రమంలో భాగంగా గ్రామాల అభివృద్ధికి ముందుకు వచ్చే వారితో కలిసి పల్లెల్లో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతాం. గ్రామాల్లో వచ్చే ఐదేళ్లలో 17,500 కిలోమీటర్ల మేర సిమెంట్ రోడ్లు, 10 వేల కిలోమీటర్ల మేర డ్రైనేజీ కాల్వలు నిర్మిస్తాం. ఇందులో ఏడాదికి ఎంత చొప్పున పనులు చేయగలరో అధికారులు లక్ష్యంగా నిర్దేశించుకోవాలి. పంచాయతీరాజ్ శాఖకు ఇవ్వాల్సిన రూ.990 కోట్లను వెంటనే ఆర్థిక శాఖ నుంచి విడుదల చేస్తాం. జల్‌జీవన్ మిషన్ పథకం అమలు కోసం రాష్ట్ర వాటా కింద రూ.500 కోట్లు విడుదల చేస్తాం. కేంద్రం ఇచ్చే నిధులను కూడా సద్వినియోగం చేసుకుని ఇంటింటికీ తాగునీరు అందిస్తాం' అని చెప్పారు. ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామీణ ప్రాంతాల్లో 2,500 కిలోమీటర్ల మేర బీటీ రోడ్లు, 5 లక్షల ఫామ్‌పాండ్స్ తవ్వకాలను లక్ష్యంగా పెట్టుకున్నట్లు అధికారులు ఈ సందర్భంగా సీఎంకు వివరించారు. ప్రైవేటు సంస్థల భాగస్వామ్యంతో అడవుల్లో టూరిజం అభివృద్ధికి చర్యలు చేపట్టాలని అటవీ, పర్యావరణ శాఖ అధికారులను చంద్రబాబు ఆదేశించారు.

### సాంప్రదాయేతర విద్యుత్‌కు ఏపీనే కేంద్రం

సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి రాష్ట్రంలో అనేక అవకాశాలున్నాయని వాటిని సద్వినియోగం చేసుకుంటే దేశంలోనే సాంప్రదాయేతర విద్యుత్ ఉత్పత్తికి ఆంధ్రప్రదేశే అతిపెద్ద కేంద్రం అవుతుందని సీఎం అన్నారు. నూతన ఇంధన పాలసీ-ఇంటిగ్రేటెడ్ క్లీన్ ఎనర్జీ పాలసీ 2024 పై సంబంధిత శాఖాధికారులతో సీఎం సమీక్షించారు.

# ప్రగతి భవన్ (ఇప్పుడు ప్రజాభవన్) గేట్ల ముందు పడిగాపులు పడేలా

మొదటి పేజి తరువాయి



## అహంకారమా? .. కుంగుబాటా?

పార్టీ ఎమ్మెల్యేలను గంటల తరబడి ప్రగతి భవన్ (ఇప్పుడు ప్రజాభవన్) గేట్ల మందు పడిగాపులు పడేలా చేసిన కేసీఆర్ కు ఇప్పుడు పిలిచినా సొంత పార్టీ ఎమ్మెల్యేలే కాదు ద్వితీయ శ్రేణి నేతలూ అందుబాటులోకి రాని పరిస్థితి ఎదురైంది.తెలంగాణ ఆవిర్భావం తరువాత వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికలలో విజయం సాధించి ముఖ్యమంత్రిగా అధికార పగ్గాలు అందుకున్న కేసీఆర్ తనను తాను సర్వశక్తిమంతుడిగా ఊహించుకున్నారు. మరీ ముఖ్యంగా రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్ పార్టీలను నిర్వీర్యం చేసేయడంతో రాష్ట్రంలో ఇక తనకు తిరుగేలేదన్న భావనకు వచ్చారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికలలో ఓటమి కేసీఆర్ కు, బీఆర్ఎస్ కు దిమ్మదిరిగేలా చేసింది. ఎందుకంటే.. రాష్ట్రంలో తమకు బీజేపీ నుంచి మాత్రమే నామమాత్రపు పోటీ ఉంటుందని, రాష్ట్రంలో తెలుగుదేశం, కాంగ్రెస్ లకు అసలు చోటే లేదని కేసీఆర్ భావించారు. కాంగ్రెస్ పట్ల, ఆ పార్టీ నేతల పట్ల చాలా చులకన భావన వ్యక్తం చేశారు. అటువంటి కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారంలోకి రావడం, ఆ తరువాత జరిగిన లోక్ సభ ఎన్నికలలో బీఆర్ఎస్ కు కనీసం ఒక్కటంటే ఒక్క స్థానం కూడా దక్కకపోవడంతో కేసీఆర్ డీలా పడిపోయారు. దీనికి తోడు తాను తానా అంటే తందానా అనే పలువురు ఎమ్మెల్యేలు పార్టీకి గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పంచన చేరారు. ఇంకా పలువురు అదే బాట పట్టే అవకాశాలున్నాయనీ, బీఆర్ఎస్ ఇప్పుడో అప్పుడో బీజేపీలో వినీలమైపోతుందన్న చర్చ కూడా తెలంగాణలో జోరుగా సాగుతోంది.ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ కేడర్ లో ధైర్యం, స్థైర్యం నింపాల్సిన కేసీఆర్ పూర్తిగా ఫామ్ హౌస్ కే పరిమి తమైపోయారు. కేవలం ఒక్కటంటే ఒక్క రోజు మినహాయిస్తే ఆయన అసెంబ్లీకి కూడా గైర్హాజరయ్యారు. పార్టీ పరాజయం తరువాత ఈ తొమ్మిది నెలల కాలంలో ఓ మూడు నాలుగు సార్లు మినహా ఆయన బహిరంగంగా కనిపించింది లేదు. ఇక్కడే పరిశీలకులలోనూ, పార్టీ నేతలు, శ్రేణులలోనూ కేసీఆర్ ది అహంకారమా, కుంగుబాటా అన్న అనుమానాలు వ్యక్తం ఔతున్నాయి. కేసీఆర్ సహజంగా దూకుడుగా వ్యవహరించే రాజకీయ వేత్త. కానీ అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ ఓటమి పాలై తాను ప్రతిపక్ష నేత పాత్రకు పరిమితమైన తరువాత ఆయన చాలా వరకూ ఫామ్ హౌస్ కే పరిమితమైపోయారు.అసెంబ్లీ ఎన్నికలలో పార్టీ పరాజయం తరువాత ఆయన బయటకు వచ్చి సభలలో మాట్లాడిన దాఖలాలు లేవు. కేవలం పార్లమెంటు ఎన్నికల ప్రచారం సందర్భంగా మాత్రమే ఆయన ప్రజా సమూహంలోకి వచ్చి గళం వినిపించారు. పార్లమెంటు ఎన్నికలలో బీఆర్ఎస్ జీరో పెర్ఫార్మెన్స్ తరువాత ఆయన మరీ నల్లపూసై పోయారు. తెలంగాణ పితగా తాను రాష్ట్రాన్ని శాశ్వతంగా పాలిస్తానని భావించేవారు. విపక్ష నేతలెవరూ తన కాలిగోటికి కూడా సరితూగరని భావించేవారు. మరీ ముఖ్యంగా రేవంత్ రెడ్డిని ఆయన చాలా చులకనగా చూసేవారు. ముఖ్యమంత్రిగా తాను అధికారంలో ఉన్నంత కాలం కేసీఆర్ రేవంత్ రెడ్డి పేరు ఉచ్చరించడానికి కూడా ఇష్టపడలేదు. అయితే ఇప్పుడు రేవంత్ రెడ్డి రాష్ట్ర ముఖ్యమత్రి. కేసీఆర్ అహంకారపు కోట గోడల్ని బద్దలు కొట్టిన నాయకుడు. ఇప్పుడు కేసీఆర్ మౌనానికీ, ప్రజా జీవితానికి దూరంగా ఉండడానికీ అదే కారణమని పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. కారణమేదైతేనేం కేసీఆర్ క్రియాశీలంగా లేకపోవడం బీఆర్ఎస్ ను మరింత బలహీన పరుస్తోంది. కేటీఆర్, హరీశ్రావు ఎంత ప్రయత్నించినా కేసీఆర్ క్రియాశీలంగా లేని లోటును పూడ్చ లేకపో తున్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నంత కాలం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడిగా, డిఫాక్టో సీఎంగా అత్యంత ప్రభావమంతంగా, శక్తిమంతంగా కనిపించిన కేటీఆర్ ఇప్పుడు తేలిపోతున్నారు. హరీష్ రావు పరిస్థితి కూడా దాదాపు అంతే.బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ట్రబుల్ షూటర్ గా చక్రం తిప్పిన ఆయన ఇప్పుడు స్వయంగా ఇబ్బం దుల్లో కూరుకు పోతున్నారు. ఈ పరిస్థితుల్లో బీఆర్ఎస్ ఏ మాత్రంగానైనా నిలదొక్కుకోవాలన్నా, ప్రజా క్షేత్రంలో బలోపేతం కావాలన్న కేసీఆర్ తన మౌనం వీడి జనంలోకి రావాలి. అయితే కేసీఆర్ ఫామ్ హౌస్ వదిలి బయటకు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదు. ఆయన ప్రజా జీవితంలో క్రియాశీలంగా వ్యవహరించకపోవడానికి కారణం ఏమిటన్నదానిపై విస్తృతంగా చర్చ జరుగుతోంది. పరిశీలకులు అయితే కేసీఆర్ మౌనానికి, ముఖం చాటేయడానికి కారణం అయితే అహంకార లేకుంటే కుంగుబాటు అని విశ్లేషిస్తున్నారు.

## ఎమ్మెల్యే చోరువతో గ్రామాభివృద్ధికి

# సై అంటున్న కిసరలి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి



కల్లూరు - ప్రభాత సూర్యుడు: సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో పేరువంచ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి అన్నారు. ఎమ్మెల్యే ఆదేశానుసారంగా గ్రామ అభివృద్దే లక్ష్యము గా పెట్టుకుని ముందస్తు పెట్టుబడి పద్ధతి నా గ్రామం లో సిమెంట్ సూరలు వేసే కార్యక్రమం చెప్పట్టడం జరిగింది. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేదని పంచాయతీ కార్యదర్శి స్పందించి మండల అధికారి ద్రుష్టి కి తీసుకెళ్లి డ్రైనేజ్ కాలువలు మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామం పంచాయతీ లో సైడ్ కాలువలు పని అయ్యేలా చూడాలి అని గుర్తు చేసారు. సి సి రోడ్డు విషయంలో ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లి గ్రామం పంచాయతీ లో అవసరమైన బజారులకి సి సి రోడ్లు మంజూరు చేయించే విధంగా పనిచేస్తామని అన్నారు. ఎమ్మెల్యే ఆదేశాలతో వారి సహకారంతో రాబోయే స్థానిక ఎన్నికల్లో అందరూ కలిసి కష్టపడి పని చేయడం జరుగుతుందని అన్నారు. ప్రజలకు సేవ చేయాలనే సంకల్పంతో గ్రామంలోని సమస్యలను పరిష్కరించే దిశగా అధికారుల సహకారం,శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సహకారంతో పేరువంచ గ్రామ అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో పరిమి భరత్, సొసైటీ డైరెక్టర్ జానబోయిన గోపాలరావు,ఉబ్బన అశోక్ , ముళ్లపాటి నాగేశ్వరావు మరియు గ్రామం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

## అసంపూర్ణ రైతు రుణమాఫీకి నిరసనగ సెగ

- ఆర్డిఓ కార్యాలయాల ముట్టడికి బిఆర్ఎస్ పిలుపు



సిద్దిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు:అసంపూర్ణ రైతు రుణమాఫీ కి మద్దతుగా నేడు ఉదయం 9 గంటలకు తెలంగాణ లోని అన్ని జిల్లల్లోనూ ఆర్డీఓ కార్యాలయాల ముందు ధర్నా చేయాలని బిఆర్ఎస్ పార్టీ పిలుపనిచ్చింది. కింది స్థాయి, పై స్థాయి కార్యకర్త అని తేడా లేకుండా ప్రతి ఒక్కరూ ధర్నా లో పాల్గొనాలని మాజీ మంత్రి ఎంఎల్ఏ హరీష్ రావు కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షాన కాకుండా వారి స్వలాభాల కోసమే పని చేస్తుంది అని అన్నారు. గుండా రాజకీయాలకు కేర్ ఆఫ్ గా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుంది అని మండి పడ్డారు.

## రేపటి నుంచి హరీష్ రావు ఆలయాల యాత్ర



సిద్దిపేట అర్బన్ - ప్రభాత సూర్యుడు: రేపటి నుంచి హరీష్ రావు ఆలయాల యాత్ర రుణమాఫీ పై రేవంత్ రెడ్డి దేవుళ్ల మీద ఒట్టేసి దగా చేశారని.ఆలయాలకు వెళ్లి పూజలు చేస్తానని ఇటీవలే ప్రకటించిన హరీష్ రావు రేపటి నుంచి యాత్ర మొదలు పెట్టనున్నారు రేపు యాదగిరిగుట్ట నర్సింహస్వామిని దర్శించుకుని యాత్రకు అంకురార్పణ చేస్తా అని చెప్పారు

## మూడు సంవత్సరాల పాప పైన లైంగిక దాడి



ప్రభాత సూర్యుడు - సిద్దిపేట అర్బన్: మూడు సంవత్సరాల పాప పైన లైంగిక దాడి చేసిన ఘటన సిద్దిపేట పట్టణం లో చోటు చేసుకుంది సిద్దిపేట పట్టణం మైత్రివనం నందు నిర్మిస్తున్న గో గ్రీన్ అపార్ట్మెంట్ నందు నేపాల్ కు చెందిన వ్యక్తి వాచ్ మెన్ గా పని చేస్తూ తన భార్య, మనవరాలితో (కొడుకు కూతురు) నివాసం ఉంటున్నాడు. తేది: 19.08.2024 నాడు మధ్యాహ్నం 12.00 గంటల సమయంలో అదే అపార్ట్మెంట్ నందు పెయింటింగ్ పని చేయుచున్న ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం గోరఖ్ పూర్ జిల్లా రసూల్ పురా గ్రామనికి చెందిన అజయ్, అనే వ్యక్తి వాచ్ మెన్ యొక్క (03) సంవత్సరాల వయస్సు గల మనుమరాలిని అడిస్తానని చెప్పి తన రూంలోకి తీసుకపోయి అత్యాచారం చేయగా పాప ఏడుస్తుండడంతో వాచ్ మెన్ వెళ్ళి చూసి మనవరాలిని ఎత్తుకొని వెంటనే పోలీసులకు సమాచారం అందించగా రిటౌన్ ఇన్స్పెక్టర్ మరియు సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి పూర్తి విచారణ జరిపి పాపను సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి పంపించడం జరిగింది. పై సంఘటన విషయంలో కేసు నమోదు చేసి పరిశోధన ప్రారంభించి కేసు పరిశోధనలో భాగంగా పై నిందితున్ని తేదీ: 20-08-2024 పొన్నాల బ్రిడ్జ్ వద్ద ఏదైన వాహనం ఎక్కడానికి నిలబడి ఉండగా పట్టుకోని విచారించి అరెస్ట్ చేసి జ్యుడీషియల్ రిమాండ్ కు పంపించడం జరిగిందని త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. చికిత్స పొందుతున్న పాప ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉంది, ఎలాంటి ఆందోళన చెందవలసిన అవసరం లేదని డాక్టర్లు తెలిపారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ, ఐపీఎస్ మేడమ్ త్వరగా అన్ని కోణాలలో ఇన్వెస్టిగేషన్ పూర్తి చేసి టెక్నికల్ మరియు ఫారెన్సీస్ ల్యాబ్ రిపోర్ట్స్ త్వరగా తెప్పించి కేసులో త్వరగా చార్జిషీట్ వేసి ఫాస్ట్ ట్రాక్ కోర్టులో ట్రాయల్ నిర్వహించి బాధితురాలు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

## ఎమ్మెల్యే చోరువతో గ్రామాభివృద్ధికి సై అంటున్న కీసరలి

కాంగ్రెస్ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి



కల్లూరు - ప్రభాత సూర్యుడు : సత్తుపల్లి శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ సహకారంతో పేరువంచ గ్రామాన్ని అభివృద్ధి చేస్తామని కాంగ్రెస్ సీనియర్ నాయకులు కీసర మోహన్ రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలో పేరువంచ గ్రామం లో అభివృద్దే లక్ష్యము గా కిసర మోహన్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామం లో నీళ్లు నిలిచే ప్రదేశాల లో సిమెంట్ సూరలు అవసరమైన చోట జేసీబీ ద్వారా గాడి తీసి సీమెంట్ సూర్ల ను వెయించడం జరిగింది. మంత్రివర్యులు తుమ్మల నాగేశ్వరావు,పొంగులేటి శ్రీనివాసరెడ్డి ,ఎంపీ రామసహాయం రఘు రామిరెడ్డి, శాసనసభ్యులు డాక్టర్ మట్టా రాగమయి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్ సహకారంతో పేరువంచ గ్రామ అభివృద్ధి కోసం విశేషమైన కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘముఖమ్మం జిల్లా యువజన ఉపాధ్యక్షులు పరిమి భరత్, సొసైటీ డైరెక్టర్ జోనబోయిన గోపాలరావు,ఉబ్బన అశోక్ , ముళ్లపాటి నాగేశ్వరావు, మరియు గ్రామం పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు ఈ కార్యక్రమం లో పాల్గొన్నారు.

# గ్రామ పంచాయతీ కాంప్లెక్స్ రూమ్ లు వేలం పాట ఏమాయే

- పారదర్శకంగా వేలం నిర్వహించండి
- స్థానికులకు అవకాశం కల్పించండి
- అయోమయంలో అధికారులు



కల్లూరు - ప్రభాత సూర్యుడు: జిల్లాలో అతిపెద్ద మేజర్ గ్రామపంచాయతీగా సుమారు18 వేల జనాభా కలిగి ఉండి సుమారు 12 వేల ఓటర్లు ఉన్నా రాష్ట్రములోనే అతి పెద్ద మేజర్ గ్రామ పంచాయతీ కల్లూరు గ్రామ పంచాయితీ. ప్రజల అవసరాలకు అనుగుణంగా గ్రామ అభివృద్ధి కొరకు కొంత ఆదాయం సమకూర్చడం కోసం గతంలో అధికారులు పాలకులు ఇప్పటివరకు సుమారు 40 పైన కాంప్లెక్స్ రూము ఏర్పాటు చేశారు వాటి ద్వారా కొంత ఆదాయం సమకూర్చబడుతుంది. అద్దెల రూపములో వచ్చే ఆదాయం ద్వారా గ్రామ పంచాయతీ అభివృద్ధికి అవసరమైన పనుల కోసం వినియోగిస్తారు. ఖమ్మం జిల్లా కల్లూరు మేజర్ గ్రామపంచాయతీ నందు ఉన్న కాంప్లెక్స్ రూములు గత కొన్ని సంవత్సరాలుగా పాటలు నిర్వహించకుండా ఉండడంతో ఇదే గ్రామానికి చెందిన నిరుద్యోగ యువకులు గ్రామానికి సంబంధించిన ప్రజలు కాంప్లెక్స్ లకు ఎప్పుడు వేలం పెడతారని వెయ్యి కళ్ళతో ఆశతో ఎదురు చూస్తున్నారు.కానీ గత ఐదు సంవత్సరాలుగా అధికారులు మాత్రం వేలంపాట నిర్వహించకుండానే షాపులు కొనసాగించారు,దీనిలో పరమార్థం ఏంటన్నది అర్థం కాని అంతుచిక్కని ప్రశ్నగా మారింది.గతంలో కాంప్లెక్స్ రూములు వేలంపాట దక్కించుకున్న కొందరు వాటిని అమ్ముతున్నట్లు సమాచారం ఉంది.అయితే వేలంపాట దక్కించుకున్న కొందరు వ్యక్తులు వాటిని లక్ష నుంచి 3 లక్షల రూపాయలు వరకు అమ్ముతున్నట్లు సమాచారం తెలియ వచ్చింది.అధికారులకు తెలిసి జరుగుతుందా, తెలియక జరుగుతుందా అన్న విషయంపై స్పష్టత రావాల్సిందే.వేలం పాట నిర్వహించి సంవత్సరాలు గడుస్తున్నా ఎందుకు కాంప్లెక్స్ రూములకు వేలం నిర్వహించడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. పరిపాలన విధానంలో అధికార యంత్రాంగం తమ పని తాము చేసుకుంటూ పోవాలి కానీ ఎందుకు ఆగిపోయారో ఎవరికీ అంతుచిక్కని ప్రశ్నలాగా మిగిలింది.మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న కాంప్లెక్స్ రూమ్ లకు వేలం నిర్వహిస్తున్న ప్రచారం జోరుగా జరిగింది. ప్రజలందరూ కూడా ఎదురు చూశారు కానీ అంతలోనే స్థానికుల ఆశలు ఆవిరైపోయాయి. ఈ కాంప్లెక్స్ రూములకు వేలంపాట నిర్వహించకుండా అడ్డుకుంది ఎవరు అన్న సంగతి కూడా తెలియాల్సి ఉంది అని ప్రజలు అంటున్నారు. ఏది ఏమైనా ఇది ప్రజలకు కచ్చితంగా తెలియాల్సిందే...? అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయవలసింది వేలంపాట దక్కించుకుంది ఎవరు? ఆ షాపులలో ఎవరు ఉంటున్నారు..? బినామీలు ఉన్నారా...?

అన్న విషయాన్ని పరిశీలించాలి. ఒకవేళ అలాంటి అక్రమాలకు పాల్పడితే వారికి నోటీసులు ఇచ్చి ఆ రూములను గ్రామ పంచాయతీ స్వాధీనం చేసుకోవాలి.పంచాయతీ రాజ్ యాక్ట్ ప్రకారం వేలంపాట దక్కించుకున్న వ్యక్తులు ఆ షాపులను మరొకరికి ఇవ్వడానికి ఎటువంటి అధికారం వారికి లేదు. ఆ షాపు తనకు వద్దనుకుంటే గ్రామపంచాయతీ కార్య నిర్వహణ అధికారికి తెలియజేసి ఆ షాపును వారికి అప్పగించాలి.అధికారులు మరల దాన్ని వేలంపాట నిర్వహించి ఆ షాపులను కేటాయించవలసి ఉంటుంది. అలా కాకుండా ఎవరికి నచ్చినట్టు వారి షాపులు అమ్ముకుంటూ పోతా ఉంటే అధికారులు మౌనంగా ఉండటం వలన దానిపై పలు ఆలోచన, అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇంతకాలం అయినా కూడా ఉన్నత అధికారులు వేలంపాట నిర్వహించకుండా నాన్సుడు ధోరణి ప్రదర్శించడంతో అధికారులు పట్ల పలు స్థానికులకు అనుమానాలు కలుగుతున్నాయి. అధికారులు ఎటువంటి అపోహలకు తావు లేకుండా మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని ఉన్న కాంప్లెక్స్ రూమ్ లపై వెంటనే స్పందిస్తూ చర్యలు చేపట్టాలని ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.జిల్లా ఉన్నత అధికారులు మేజర్ గ్రామపంచాయతీ కాంప్లెక్స్ లపై ఉన్న అపోహలు తొలగిపోవాలంటే వెంటనే వేలంపాట నిర్వహించి అందరికీ అవకాశం కల్పించాలని స్థానికులు, నిరుద్యోగ యువతీ, యువకులు కోరుతున్నారు.

### కాంప్లెక్కుంలపై అవకాశం ఎవరికీ

మేజర్ గ్రామపంచాయతీలో కాంప్లెక్స్ కేటాయించే విషయంలో కేవలం ఈ గ్రామపంచాయతీ వారికే ఇవ్వాలా... లేక ఈ గ్రామం కాకపోయినా పర్వాలేదా.... ఈ మండలం కాకపోయినా ఎవరికైనా ఇవ్వచ్చా., అనే దానిపై పంచాయతీ రాజ్ చట్టం నిబంధనలపై అధికారులు సరైన సమాధానం చెప్పవలసి ఉన్నది. దీనిపై అధికారులు ఏం చెప్తారో వేచి చూద్దాం.

# నాణ్యమైన పరిశోధన లేకుంటే..




విశ్వవిద్యాలయాలలో అన్నికోర్సుల్లో పరిశోధనలు వేగంగా జరుగుతున్నాయి. ఈ రంగంలో ఎదురయ్యే సమస్యలు ఇతర పరిశోధనా రంగాలకు కూడా వర్తిస్తాయి. సాధారణంగా పరిశోధన పట్ల స్వతహాగా ఆసక్తి కంటే, పీజీ అయిన వెంటనే హాస్టల్‌లో భోజనం, వసతి, ఇతర ఆర్థిక అవసరాల కోసం వెంటనే వేరే ఆదాయ మార్గం కనిపించక పోవటంతో విద్యార్థులు పీహెచ్‌డీలో ఎక్కువమంది చేరుతున్నారు. ఈ కోర్స్‌లో సీటు లభించగానే కనీసం 3-4 సంవత్సరాలపాటు కొంత రిలీఫ్ దొరుకుతుంది. యూజీసీ ఇతర సంస్థల నుండి కొంత ఆర్థిక వెసులుబాటు కూడా లభి స్తుంది. కానీ పరిశోధకుడు తాను ఎంచు కున్న పరిశోధనా అంశంపై లోతైన అధ్య యనం, అన్వేషణ, ఆలోచన చేయకుండానే రీసెర్చ్ టాపిక్‌ని ఎంచుకుంటున్నాడు. ఆ రంగానికి సంబంధించిన సమగ్ర సమాచా రం, సాహిత్యం, విమర్శనాత్మక వ్యాసాలు, పరిశోధనా నివేదికలు (రిపోర్టులు), గ్రంథ సూచీలు, సమీక్షలు వచ్చాయా లేదా అనే విషయాలను పట్టించుకోకుండానే పరిశోధకులు పీహెచ్‌డీ కోర్సుల్లో చేరి పరిశోధనా టాపిక్‌ను వేగంగా ఎంచు కుంటున్నారు. తీరా పరిశోధనకు ఉపక్రమించాక తగినంత సమాచారం లభించక పరిశోధకుడు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు.

### డాక్టరేట్‌ను డిగ్రీగా భావించి..

పరిశోధకుడికి పరిశోధనా అంశంపై స్వతహాగా ఆసక్తి, అభిరుచి, లేకపోతే ఆ పరిశోధన కూడా మొక్కుబడిగా, నిస్సారం గా కొనసాగుతుంది. పరిశోధనా ఫలితా లు కూడా అలాగే పేలవంగా వస్తాయి. అందుకే చాలామంది పరిశోధకులు ఒకసారి పీహెచ్‌డీ అవార్డు అందుకున్నాకా, కనీసం తమ పరిశోధనా థీసిస్ మొహం కూడా చూడరు. దీనిని పీహెచ్‌డీని విద్యారంగంలో సాధించదగిన ఉన్నత డిగ్రీగా భావిస్తారు. ఈ డిగ్రీతో ఉద్యోగం దొరికాక తమ పేరుకు ముందు డాక్టర్ అనే పదాన్ని చూసుకొని సంతృప్తి పడతారు. డాక్టరేట్ అనేది ఒక ప్రాథమిక సోపానం అనే విషయాన్ని మరచిపోయి అంతిమ, అత్యుత్తమ డిగ్రీగా భావిస్తారు. ఒక విషయాన్ని ఒక పరిశోధనా దృష్టితో చూడటానికి మాత్రమే పీహెచ్‌డీ ఉపయోగపడుతుంది. చాలా మంది పోస్ట్ డాక్టోరల్ వర్క్‌ను చేపట్టటం లేదు. విద్యా దాహం, పరిశోధనా దృష్టి నిరంతరం కొనసాగే వ్యాపకం, వ్యసనం కావాలి. తాము చేసిన పరిశోధనా రంగలో ప్రపంచ వ్యాప్తంగా నూతన పోకడలు, వినూత్న అంశాలు, పరిశోధనా పురోగతిని వివిధ మాధ్యమాల్లో గమనిస్తుండాలి. పరిశోధకుడు తనకు తాను అప్‌డేట్ అవుతూ ఉండాలి. తరచుగా పరిశోధనా జర్నల్స్‌ను చదవాలి. నిత్యం తమ సబ్జెక్ట్‌పై సమకాలీన విషయాలపై నూతన తరానికి పనికి వచ్చే రచనలను సులభ భాషలో పత్రికలు, పరిశోధనా జర్నల్స్‌లో రాస్తూ ఉండాలి. ఇతరులు రాస్తున్న వాటిని చదువుతూ తమ అవగాహనా పరిధిని పెంచుకోవాలి. విద్య నిరంతరం కొనసాగే ప్రక్రియ. ఒక డిగ్రీతో, ఉద్యోగంతో జ్ఞానాన్వేషణ అంతం కాదు.

### సబ్జెక్టును గైడ్ బలవంతంగా రుద్దితే..!

చాలామంది పరిశోధక సూపర్ వైజర్లు తమకు ఆసక్తి, పరిచయం ఉన్న అంశాలపైనే లేదా ప్రత్యేక విభాగంలోనే తమ స్కాలర్లకు రీసెర్చ్ టాపిక్‌లను ఇస్తూ కొన్నిసార్లు బలవంతంగా రుద్దుతుంటారు. అయితే ఈ రోజుల్లో పరిశోధకుని ఆసక్తితో పాటు ఉద్యోగ, ఉపాధి అవసరాన్ని గమనించి ఆ టాపిక్ ఇవ్వడం కూడా అవసరమే. అలాగే చాలా మంది పర్యవేక్షకులకు ఒక బలహీనత ఉంటుంది. తాము చెప్పిందే వేదం అనుకుంటారు. రీసెర్చ్ స్కాలర్ భావజాలం, అభిరుచి, అభినివేశం, స్వయం నిర్ణయాలు, భిన్న వ్యక్తిత్వం వారికి నచ్చవు. అప్పుడు విధిలేక పరిశోధకుడు తన పర్యవేక్షకుడి నిర్ణయం మేరకు డిగ్రీ కోసం తమ ఆసక్తిని చంపుకుని రాజీపడతారు. లేదా రీసెర్చ్‌నే మధ్యలో వదిలేస్తారు. సూపర్ వైజర్లకు చాలా మందికి రీసెర్చ్ స్కాలర్ల పట్ల చిన్న చూపు ఉంటుంది. వారితో వెట్టి చాకిరీ చేయించుకొన్న సందర్భాలు, హేళన చేసి, చిన్న బుచ్చిన ఉదంతాలు కూడా లేకపోలేదు. కొన్నిచోట్ల మహిళా స్కాలర్ల పట్ల లైంగిక వేధింపులు, అనుచిత ప్రవర్తనలపై ఆరోపణలు వచ్చిన ఉదాహరణలు ఉన్నాయి. ఇలాంటి కేసులు చాలావరకు స్కాలర్ల భవిష్యత్తు దృష్ట్యా వెలుగు చూడవు. అందరినీ ఒకే గాటన కట్టలేము. మినహాయింపులు ఎక్కడైనా ఉంటాయి.

### పరిశోధనతోటే ప్రగతి బాట

విశ్వవిద్యాలయాల్లో అప్పుడప్పుడు కొన్ని అపశృతులు దొర్లినా ప్రజాస్వామ్య వాతావరణం ఉంటుంది. పరిశోధన చేసే వారిలో అత్యధికులు అట్టడుగు సామాజిక వర్గాల వాళ్లే కావటం హర్షనీయం. ప్రస్తుతం మన దేశ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యకు, పరిశోధనలకు బడ్జెట్‌లో కేటాయింపులు ప్రతి సంవత్సరం గణనీయంగా పడిపోతున్నాయి. యూజీసీ ప్రాధాన్యత తరిగిపోయింది. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మన విశ్వ విద్యాలయ స్థాయి, పరిశోధనల స్థాయి కూడా క్రమంగా పడిపోతుంది. నిధులు, వసతులు సమకూర్చడంలో కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యం చూపుతుంది. గత 15 ఏళ్లుగా ప్రొఫెసర్ల నియామకాలు నిలిచిపోయాయి. పార్ట్ టైం, గెస్ట్ లెక్చరర్లతో అతి కష్టంగా విద్యాబోధన జరుగుతుంది. ఇక ఇతర సిబ్బంది నియామకాలు కూడా నిలిచిపోయాయి. ప్రభుత్వ విశ్వ విద్యాలయాలు వసతుల లేమితో అవస్థలు పడుతున్నాయి. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను దేశ భవిష్యత్తుగా భావించాలి. నిరర్థక ఖర్చుగా చూడరాదు. యువత భవిష్యత్తుకు, దేశ ప్రతిష్టకు విద్యపై పట్టే ప్రతిపైసా పెట్టుబడిగా చూడాలి. నాణ్య మైన విద్య, పరిశోధన లేకుండా ఏ దేశం కూడా ప్రగతి సాధించలేదు.

# కెనడాలో భారతీయ విద్యార్థుల కష్టాలు..

భారతదేశంలోని విద్యార్థులకు అత్యంత ఇష్టమైన నాలుగు గమ్యస్థానాలలో కెనడా ఒకటి. కెనడాకు వెళ్లే 72 శాతం మంది భారతీయ విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యుయేట్ వర్క్ పర్మిట్ పొందాలని కోరుకుంటారు, అయితే 60 శాతం మంది కెనడాలో శాశ్వత నివాసం పొందాలని ఆకాంక్షిస్తారు. 2023 నాటికి, భారతదేశం నుండి దాదాపు 3,30,000 మంది కొత్త వలసదారులు (విద్యార్థులతో సహా) కెనడాలో నివసిస్తున్నారు.

### అద్దెలు చెల్లించడానికి సరిపోక..

ఇటీవలి కాలంలో కెనడాలో విద్య, ఉపాధి లక్ష్యాలను సాధించడంలో భారతదేశంలోని విద్యార్థులు చాలా కష్టాలు ఎదుర్కొంటున్నారు. ఇందులో మొదటిది సౌకర్యవంతమైన వసతి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం 3.45 లక్షల గృహ యూనిట్ల కొరత ఉంది. భవిష్యత్తులో 35 లక్షల యూనిట్లకు పైగా గృహాల కొరతను అంచనా వేసింది, అంటే ప్రస్తుత కొరత కంటే 10 రెట్లు ఎక్కువ. చాలా ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థులకు సరిపడా వసతి గృహాలు లేకపోవడంతో విద్యార్థులు అద్దె వసతి కోసం వెతుక్కోవాల్సి వస్తోంది. గత సంవత్సరం వరకు విదేశీ జీఐసీ ( విద్యార్థి ఒక సంవత్సరం పాటు వారి జీవన వ్యయాలను కవర్ చేయడానికి తమ వద్ద నిధులు ఉన్నాయని ప్రభుత్వానికి అందించాల్సిన హామీ) దీనిని కెనడా ప్రభుత్వం పెంచేసింది. దీంతో పెరుగుతున్న అద్దెలతో, జీఐసీ కింద వచ్చే రాబడి తమ అద్దెలకు చెల్లించడానికి కూడా సరిపోవడం లేదని విద్యార్థులు వాపోతున్నారు.

### తగ్గిపోతున్న పార్ట్‌టైమ్ జాబ్స్



అంతేకాకుండా, విద్యార్థులకు కళాశాలలు వసూలు చేసే ట్యూషన్ ఫీజు రెసిడెంట్ కెనడియన్లు చెల్లించాల్సిన దానికంటే ఎక్కువ. ఇప్పుడు పని దొరకడం చాలా కష్టంగా ఉంది. వైరల్ అయిన సోషల్ మీడియా పోస్ట్ ప్రకారం 600-700 మంది విద్యార్థులు పార్ట్‌టైమ్ ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకోవడానికి దుకాణాలు, రెస్టారెంట్‌ల వెలుపల గంటల తరబడి పొడవాటి క్యూలలో నిలబడుతున్నారు. అంతేకాకుండా, అనేక ప్రాంతీయ ప్రభుత్వాలు విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసిన తర్వాత వర్క్ పర్మిట్‌ల నిబంధనలను మారుస్తున్నాయి. ఉదాహరణకు, ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్ తూర్పు ప్రావిన్స్‌లో, ఆరోగ్య సంర క్షణ, ప్రాథమిక విద్య వంటి కొన్ని ఎంపిక చేసిన పని రంగాలలో మాత్రమే ఇప్పుడు కొత్త వలసదారులకు శాశ్వత నివాసం ఇవ్వబడుతుంది. దీంతో చాలా మంది భారతీయ విద్యార్థులు తమ విద్యను పూర్తి చేసిన తర్వాత కెనడా వదిలి వెళ్ళవలసి వస్తుంది.

### మధ్యలో నిబంధనలు మార్చవద్దు!

కానీ ఇప్పుడు వారి అవకాశాలు మసకబరుతున్నాయి. ప్రిన్స్ ఎడ్వర్డ్ ఐలాండ్‌లోని భారతీయ విద్యార్థులు ప్రాంతీయ ప్రభుత్వం చేసిన ఈ నిబంధనల మార్పులకు వ్యతిరేకంగా పోరాడాలని నిర్ణయించుకున్నారు. తమ అకడమిక్ ప్రోగ్రామ్ మధ్యలో వీసా పొడిగింపు, వర్క్ పర్మిట్ల నిబంధనలు మార్చరాదని డిమాండ్ చేస్తున్నారు. స్టడీ పర్మిట్‌లు పొందినప్పుడు అమలులో ఉన్న నిబంధనలనే తమకు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తున్నారు.

# జకీర్ నాయక్ అప్పగింతపై మలేసియా సానుకూల సంకేతాలు



దిల్లీ: పరారీలో ఉన్న వివాదాస్పద మత బోధకుడు జకీర్ నాయక్ అప్పగింతపై మలేసియా నుంచి సానుకూల సంకేతాలు వెలువడ్డాయి. అతడిపై తగిన ఆధారాలు సమర్పిస్తే భారత్ అప్పగింత అభ్యర్థనను పరిగణనలోకి తీసుకుంటామని ఆ దేశ ప్రధానమంత్రి అన్వర్ ఇబ్రహీం మంగళవారం వెల్లడించారు. భారత్ – మలేసియా ద్వైపాక్షిక సంబంధాల ఉన్నతీకరణకు ఈ ఒక్క అంశం అడ్డుపడొద్దని ఇబ్రహీం స్పష్టంచేశారు. మంగళవారం ప్రధాని మోదీ సహా భారత బృందంతో జరిగిన చర్చల్లో జకీర్ నాయక్ అంశం ప్రస్తావనకు రాలేదని తెలిపారు. కొన్నేళ్ల క్రితం ప్రధాని మోదీ ఇతర వేదికలపై ఈ అంశాన్ని లేవనెత్తిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. "ఒక వ్యక్తి లేదా సమూహం గురించే కాకుండా తీవ్రవాదానికి సంబంధించిన ఎలాంటి అంశాన్నైనా మేం చాలా తీవ్రంగా పరిగణిస్తాం. ఆధారాలు సమర్పిస్తే తగిన చర్యలు తీసుకుంటాం. ఆ దిశగా ఎలాంటి సలహాలు, సూచనలు చేసినా స్వీకరిస్తాం" అని ఇబ్రహీం అన్నారు. "ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోం. కఠినంగా వ్యవహరిస్తాం. ఉగ్రవాదాన్ని అణచివేయటంతో పాటు పలు అంశాల్లో భారత్‌తో కలిసి పనిచేస్తున్నాం. మరింత సహకారం, ద్వైపాక్షిక సంబంధాల బలోపేతాన్ని ఈ ఒక్క కేసు (జకీర్ నాయక్ అంశం) నిరోధించాలని నేను అనుకోను" అని ఇబ్రహీం వ్యాఖ్యానించారు. భారత్, మలేసియాలు తమ సంబంధాలను సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం స్థాయికి ఉన్నతీకరించాయి. మూడు రోజుల పర్యటన కోసం అన్వర్ ఇబ్రహీం సోమవారం దిల్లీ వచ్చారు. రక్షణ, వాణిజ్యం, పెట్టుబడులతోపాటు పలు రంగాల్లో సహకార విస్తృతికి మోదీతో చర్చలు జరిపారు. భారత్ నుంచి మలేసియాకు కార్మికులు, నిపుణులను అక్రమ మార్గాల్లో తీసుకెళున్న ఘటనలు పెరుగుతున్నందున, వాటిని నివారించడానికి క్రమబద్ధంగా నియామకాలు జరపాలని రెండు దేశాలు ఒప్పందం కుదుర్చుకున్నాయి.

# ఏపీలో సీబీఐ విచారణకు ప్రభుత్వ అనుమతి.. గెజిట్ విడుదల




అమరావతి: ఏపీలో కీలక పరిణామం చోటుచేసుకుంది. సీబీఐ ఎంట్రీకి కూటమి సర్కార్ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఏపీలో సీబీఐ విచారణకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీలోని కేంద్ర సంస్థలు, ఉద్యోగులు, ప్రైవేట్ సంస్థలపై రాష్ట్ర ప్రభుత్వ అనుమతి లేకుండానే విచారణ చేపట్టేందుకు గెజిట్ రిలీజ్ చేసింది. అయితే.. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల విషయంలో మాత్రం విచారణ చేపట్టే ముందు అనుమతి తప్పనిసరి అని కండీషన్ పెట్టింది. దీనికి సంబంధించి ఉత్తర్వులు జూలై 1నుంచే అమల్లోకి వచ్చినట్లు ఏపీ ప్రభుత్వం స్పష్టం చేసింది. ఏపీలో సీబీఐ విచారణ పరిధిని కొనసాగించేందుకు.. పెంచేందుకు ఈ గెజిట్ వీలు కల్పిస్తుంది. దీని ద్వారా సీబీఐ నిర్ధారించిన నేరాలపై విచారణ కోసం రాష్ట్ర ప్రభుత్వం అనుమతిచ్చినట్లు అయింది. చంద్రబాబు నాయుడు 2018లో ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో, ఎన్డీయే నుంచి బయటకు వచ్చిన తర్వాత, ఏపీలో సీబీఐ దర్యాప్తునకు 'సాధారణ సమ్మతిని' ఉపసంహరించుకున్నారు. అయితే 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏపీలో సీబీఐ ప్రవేశంపై నిషేధాన్ని ఎత్తివేసింది. తాజాగా రాష్ట్రంలో సీబీఐ ఎంట్రీకి సమ్మతి ఇస్తూనే.. రాష్ట్ర ప్రభుత్వ వ్రాతపూర్వక అనుమతితో మినహా, ఏపీ ప్రభుత్వం నియంత్రణలో ఉన్న ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన కేసుల్లో సీబీఐ ఎలాంటి దర్యాప్తు చేపట్టరాదని ఎన్డీఏ సర్కార్ షరతు విధించింది. ఈ మేరకు ఢిల్లీ స్పెషల్ పోలీస్ ఎస్టాబ్లిష్‌మెంట్ చట్టం, 1946 (1946 చట్టం నెం.25)లోని సెక్షన్ 3 కింద కేంద్ర ప్రభుత్వం నోటిఫై చేసిన సెక్షన్ల దర్యాప్తు కోసం ఏపి రాష్ట్రంలో సిబిఐ అధికార పరిధిని పొడిగిస్తూ గెజిట్ నోటిఫికేషన్ 792ను రాష్ట్ర హోంశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కుమార్ విశ్వజీత్ జారీ చేశారు. సీబీఐ ఎంట్రీకి ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు సాధారణ సమ్మతి ఇవ్వకపోతే.. దర్యాప్తు చేయడానికి వీల్లేదు. ఒకవేళ కోర్టు ప్రత్యేకంగా ఆదేశిస్తే.. ఆ కేసును సీబీఐ టేకప్ చేస్తుంది.

# తీవ్ర విషాదం.. ఇద్దరు వ్యాపార దిగ్గజాల మృతి.. మిగిలిన వారంతా సేఫ్.. కుట్ర కోణం దాగి ఉందా?



ఢిల్లీ : ఇటీవల మోసం కేసులో నిర్దోషిగా విడుదలైన వ్యాపారవేత్త.. తన భార్య, కుమార్తెతో కలిసి నౌకలో విహారానికి వెళ్లారు. అయితే, విహార యాత్ర విషాదంగా మారిపోయింది. ఈ ఘోర బోటు ప్రమా దంలో ఇద్దరు దిగ్గజ వ్యాపారవేత్తల మృతి చెందారు. మిగిలిన వారంతా సేఫ్.. ఇటలీలోని సిసిలీలో జరిగిన ఈ ఘోరం వెనుక కుట్రకోణం ఉందా? అన్న అనుమానాలు రేకెత్తిస్తున్నాయి. ఇటలీలో తీవ్ర తుఫాను కారణంగా ఓ విలాసవంతమైన నౌక సముద్రంలో మునిగిపోయిందని సమాచారం. సిసిలీ తీర ప్రాంతంలో రాకాసి అల వచ్చి దాడి చేయడంతో నౌకను ముంచేశాయి. ఈ ప్రమాదంలో మోర్గాన్ స్టాన్లీ బ్యాంక్ ఇంటర్నేషనల్ చైర్మన్ జోనాథన్ బ్లూమర్, అటానమీ కార్పొరేషన్ వ్యవస్థాపకుడు మైక్ లించ్ సహా పలువురు మృతి చెందారు. ఈ ప్రమాదం నుంచి లించ్ భార్యతో పాటు మరో 15 మంది ప్రాణాలతో బయటపడ్డారు. దాదాపు 56 మీటర్ల పొడవు ఉన్న బయేసియాన్ అనే విలాసవంతమైన నౌక, మొత్తం 22 మందితో ప్రయాణం మొదలుపెట్టింది. వీరిలో బ్రిటన్, అమెరికా, కెనడా వాసులు ఉన్నారు. స్థానిక కాలమానం ప్రకారం సోమవారం(ఆగస్ట్ 19) సాయంత్రం 5 గంటల సమయంలో తీవ్రమైన సుడిగాలి కారణంగా పడవ బోల్తా పడింది. ప్రమాదం నుంచి 15 మందిని కాపాడారు. షిప్ కుక్ మృతదేహాన్ని వెలికి తీశారు. తన సహోద్యోగుల కోసం మైక్ లించ్ ఈ ట్రిప్ ను ప్లాన్ చేసినట్టు చెబుతున్నారు. ఇటీవలే అమెరికాలో ఒక మోసం కేసులో బయటపడ్డ లించ్.. సముద్ర ప్రమాదం నుంచి తప్పించుకోలేకపోయాడు. ప్రమాదం గురించి సమాచారం అందుకున్న రెస్క్యూ దళాలు.. వెంటనే రంగంలోకి దిగాయి. ఉపరితలం నుంచి 50 అడుగుల లోతులో నౌక ఉన్నట్టు గుర్తించిన డైవర్లు.. లోపలి ఉన్నవారి కోసం గాలించారు. లించ్‌పై అమెరికా టెక్ దిగ్గజం హెచ్‌పీ సాఫ్ట్‌వేర్ చౌర్యంపై గతంలో కేసు వేసింది. ఈ కేసులో లించ్‌తోపాటు ఆరోపణలు ఎదుర్కొన్న స్టీఫెన్ చాంబర్లైన్ కూడా యాదృచ్ఛికంగా ప్రాణాలు కోల్పోయాడు. బోటు ఘటన జరిగిన గంటల వ్యవధిలోనే ఇది జరిగింది. కేంబ్రిడ్జ్‌షైర్‌లోవారం జాగింగ్ చే స్టీఫెన్ శనిస్తుండగా ఓ కారు ఢీకొంది. ఈ ఘటనలో అతడు తీవ్రంగా గాయపడి లైఫ్ సపోర్టింగ్ వ్యవస్థపై ఆసుపత్రిలో ఉన్నాడు. లించ్ మరణించిన గంటల వ్యవధిలోనే అతడు కూడా ప్రాణాలు వదిలాడు. అయితే హెచ్‌పీ సాఫ్ట్‌వేర్ చౌర్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఇద్దరు ప్రముఖులు ఒకే సారి ప్రాణాలు కోల్పోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అసలిది ప్రమాదమా..? కుట్రా..? ఇంకేదైనా కోణం ఉందా..? ఇదే ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది.

# రిలయన్స్, డిస్నీ విలీనానికి బ్రేక్..!

- పోటీ వాతావరణానికి దెబ్బ
- సీసీఐ ఆందోళన
- దర్యాప్తు ఎందుకు చేయకూడదు..?




న్యూఢిల్లీ: రిలయన్స్ అనుబంధ సంస్థ, వాల్ట్ డిస్నీ విలీనానికి బ్రేక్ పడే అవకాశాలు కనబడుతున్నాయి. వీటి విలీనంపై కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) సందేహాలు వ్యక్తం చేసినట్లు రాయిటర్స్ మంగళవారం ఓ కథనం వెలువరించింది. ఇప్పటికే క్రికెట్ మ్యాచ్ ప్రసార హక్కులు పొందిన రిలయన్స్ అనుబంధ వయాకాం సంస్థలో వాల్ట్ డిస్నీ స్టార్ ఇండియా విలీనం వల్ల ఇతర సంస్థల మధ్య పోటీ వాతావరణాన్ని దెబ్బ తీస్తుందని సీసీఐ అనుమానాలు వ్యక్తం చేసిందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇరు సంస్థల విలీన ప్రక్రియపై ఎందుకు దర్యాప్తునకు ఆదేశించకూడదో తెలుపాలని రిలయన్స్, డిస్నీ యాజమాన్యాలను సిసిఐ అధికారులు ప్రశ్నించినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారం చాలా రహస్యమని సీసీఐ వర్గాలు పేర్కొన్నాయి. ఈ ఒప్పందంలో క్రికెట్ ప్రసార హక్కులే అతిపెద్ద సమస్య అని తెలుస్తోంది. దీనివల్ల కోట్ల డాలర్ల విలువైన క్రికెట్ ప్రసార హక్కులు గల రిలయన్స్.. ప్రకటనదారులపై ఆధిపత్యం, ధరల మీద నియంత్రణ సాధిస్తుందన్న అనుమానాలు ఉన్నాయని సమాచారం. ఏకచత్రాదిపత్యం నెలకొంటే ఎంటర్టైన్మెంట్ పరిశ్రమ దెబ్బతింటుందనేది ప్రధాన ఆందోళన.

వీటి విలీనంపై ఇది వరకు రహస్యంగా ఇరు సంస్థలపై 100 ప్రశ్నలు లేవనెత్తినట్టు సమాచారం. వీటిపై ఇప్పటికీ ఆయా సంస్థలు వివరణలు ఇస్తున్నాయని తెలుస్తోంది. గత ఫిబ్రవరిలో రిలయన్స్, స్టార్ ఇండియా విలీన ఒప్పందం ప్రకటించాయి. రిలయన్స్ సంస్థలో స్టార్ ఇండియా విలీనం తర్వాత ఏర్పాటయ్యే సంస్థలో మెజారిటీ వాటా ముకేశ్ అంబానీకే ఉంటుంది. విలీనంతో కొత్తగా ఏర్పాటయ్యే అతిపెద్ద వినోద సంస్థ 120 టీవీ చానెళ్లు, రెండు స్ట్రీమింగ్ సర్వీసులను అందించనున్నాయి. దీంతో సోనీ, జీ ఎంటర్ టైన్మెంట్, నెట్‌ఫ్లిక్స్, అమెజాన్ ప్రైమ్ వంటి సంస్థలకు తీవ్ర పోటీని ఇవ్వనుంది. దీన్ని సునిశితంగా పరిశీలించాల్సి ఉందని సిసిఐ నిపుణులు చెప్పినట్టు తెలుస్తుంది. తమ తాజా ప్రశ్నలకు నెల రోజుల్లో వివరణ ఇవ్వాలని ఇరు సంస్థలను సీసీఐ ఆదేశించినట్టు సమాచారం. ఈ విషయమై రిలయన్స్, డిస్నీ స్టార్ ఇండియా, సీసీఐ అధికారికంగా స్పందించాల్సి ఉంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ టెలికం రంగంలోకి ప్రవేశించిన తర్వాత ఈ రంగంలోని అనేక కంపెనీలు తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొన్నాయి. అనేక టెల్కోలు తమ కార్యకలాపాలను రద్దు చేసుకున్నాయి. దీంతో ఈ రంగంలో భారీగా ఉద్యోగాలు ఊడాయి. తొలుత చౌక ధరల్లో మొబైల్ సేవలందించిన రిలయన్స్ జియో ఇప్పుడు భారీగా పెంచేసింది. దీంతో వినియోగదారులపైనా భారం పెరిగింది. డిస్నీ, రిలయన్స్ విలీనం తర్వాత టెలికం తరహాలోనే మీడియా, ఎంటర్టైన్మెంట్ రంగంలో భారీగా కుదపు చోటు చేసుకునే ప్రమాదాలు లేకపోలేదని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అదానీ, అంబానీల గ్రూపులు వేరు వేరుగా.. పోటాపోటీగా చేపడుతున్న మీడియా కొనుగోళ్లు, విలీనాల వల్ల ఆయా రంగాల్లో ఉపాధి తగ్గిపోతోంది. ఈ నేపథ్యంలో బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి పెరుగుతున్న వేళ స్టార్ ఇండియా, వయోకాం విలీన ప్రతిపాదన ప్రక్రియ ఎలా ఉండొచ్చు వేచి చూడాలి.

# దర్యాప్తుపై నివేదిక ఇవ్వండి

- ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యమెందుకు?
- కోల్కతా ఘటనపై సీబీఐకి సుప్రీం ఆదేశం
- ఆస్పత్రిపై దాడి జరుగుతుంటే ఏం చేస్తున్నారు?
- బెంగాల్ ప్రభుత్వం, పోలీసులకు అక్షింతలు
- నిరసనకారులపై బలప్రయోగం తగదని హితవు
- జాతీయ ప్రొటోకాల్ కోసం టాస్కోర్స్ ఏర్పాటు




న్యూఢిల్లీ: కోల్కతాలోని ఆర్జీ కార్ వైద్య కళాశాల ఆస్పత్రిలో పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికోపై జరిగిన లైంగిక దాడి, హత్య ఘటనకు సంబంధించి జరుపుతున్న దర్యాప్తుపై నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు మంగళవారం సీబీఐని ఆదేశించింది. దేశంలోని వైద్య సిబ్బంది భద్రత కోసం అవసరమైన మార్గదర్శకాలను రూపొందించేందుకు జాతీయ టాస్కోర్సును ఏర్పాటు చేస్తూ మూడు వారాలలో మధ్యంతర నివేదిక అందజేయాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ నేతృత్వంలో జస్టిస్ జేబీ పార్డివాలా, మనోజ్ మిశ్రాతో కూడిన సుప్రీంకోర్టు బెంచ్ కోల్కతా ఘటనపై సుమోటోగా విచారణ జరుపుతోంది.

మరో అఘాయిత్యం జరిగే వరకూ ఎదురు చూడలేం

సంఘటనకు సంబంధించి ఎఫ్ఐఆర్ నమోదు చేయడంలో జరిగిన జాప్యంపై న్యాయస్థానం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఇందుకు బెంగాల్ ప్రభుత్వాన్ని, ఆస్పత్రి యాజమాన్యాన్ని తప్పుపట్టింది. మరో అత్యాచార ఘటన జరిగే వరకూ దేశం ఎదురు చూడలేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. 'ఘటన జరిగినప్పుడు బాధితురాలి తల్లిదండ్రులు ఆస్పత్రిలో లేరు. కేసు నమోదు చేయాల్సిన బాధ్యత ఆస్పత్రిదే' అని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. గురువారం తెల్లవారుజామున ఆస్పత్రిపై వందలాది మంది దాడి చేయడం, ఘటనా స్థలం నుండి కోల్కతా పోలీసులు పారిపోయారంటూ ఆరోపణలు రావడంపై న్యాయస్థానం స్పందిస్తూ ఆస్పత్రి ప్రాంగణంలో సీఐఎస్ఎఫ్ సిబ్బందిని నియమించాలని ఆదేశించింది. 'ఈ ఘటన దేశంలోని వైద్య సిబ్బంది భద్రతపై అనేక ప్రశ్నలు లేవనెత్తుతోంది. వైద్య సిబ్బంది చాలా తేలికగా హింసకు గురవుతున్నారు. ముఖ్యంగా మహిళా వైద్యులను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తున్నారు. చాలా మంది మహిళలు ఉద్యోగులుగా చేరుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో క్షేత్ర స్థాయిలో పరిస్థితులు మారడానికి మరో అత్యాచారం జరిగే వరకూ దేశం ఎదురు చూడలేదు' అని జస్టిస్ చంద్రచూడ్ అన్నారు. మహిళలు సురక్షితంగా పనిచేసే పరిస్థితులు కల్పించలేకపోవడం అంటే వారికి సమానత్వం కల్పించడాన్ని నిరాకరించడమే అవుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. ఏడు వేల మంది ప్రజలు ఆస్పత్రిలో ప్రవేశించడం, వారిలో 80-90 మంది విధ్వంసానికి పాల్పడడం, రెసిడెంట్ వైద్యులను బెదిరించడంపై న్యాయస్థానం ఆందోళన వ్యక్తం చేసింది.

ఇదేం తీరు?

ఆస్పత్రి యాజమాన్యం, స్థానిక పోలీసుల తీరుపై సుప్రీంకోర్టు పలు ప్రశ్నలు సంధించింది. వేలాది మంది ప్రజలు వైద్య కళాశాల ఆస్పత్రిలో ప్రవేశిస్తుంటే వారిని అడ్డుకోవడంలో పోలీసుల వైఫల్యాన్ని నిలదీసింది. కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపిస్తూ బెంగాల్లో శాంతిభద్రతలు పూర్తిగా విఫలమయ్యాయని చెప్పారు. ఎఫ్ఐఆర్ నమోదులో జాప్యంపై బెంగాల్ తరపున హాజరైన సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ను ఉద్దేశించి 'బాధితురాలి మృతదేహాన్ని అంత్యక్రియల కోసం అప్పగించిన మూడు గంటల తర్వాత ఎఫ్ఐఆర్ ఎందుకు నమోదు చేశారు?' అని న్యాయస్థానం ప్రశ్నించింది. దీనిపై సిబల్ సమాధానమిస్తూ విచారణ ప్రారంభం కాగానే అసహజ మరణం కేసును నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఆస్పత్రి ప్రిన్సిపాల్ ప్రవర్తనపై పరిశీలన జరుగుతుండగానే ఆయనను మరో కళాశాలలో నియమించడాన్ని కూడా న్యాయస్థానం తప్పుపట్టింది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వారిపై బలప్రయోగం చేయవద్దని రాష్ట్ర ప్రభుత్వానికి హితవు పలికింది.

టాస్కోర్స్ సభ్యులు వీరే

పని ప్రదేశంలో మహిళల భద్రత కోసం జాతీయ ప్రొటోకాల్ అవసరాన్ని సుప్రీంకోర్టు నొక్కి చెప్పింది. అందుకోసం సర్జన్ వైస్ అడ్మిరల్ ఆర్సీ సరిన్ నేతృత్వంలో పది మంది సభ్యులతో జాతీయ టాస్కోర్సును నియమించింది. ఈ కమిటీలో సరిన్తో పాటు డాక్టర్ డి.నాగేశ్వరరెడ్డి, డాక్టర్ ఎం.శ్రీనివాస్, డాక్టర్ ఎం.ప్రతిమామూర్తి, డాక్టర్ గోవర్ధన్ దత్ పూరి, డాక్టర్ సౌమిత్రా రావత్, ప్రొఫెసర్ అనితా సక్సేనా, ప్రొఫెసర్ పల్లవి సప్రే, డాక్టర్ పద్మ శ్రీవాత్సవ సభ్యులుగా ఉంటారు. మూడు వారాలలో మధ్యంతర నివేదిక ఇవ్వాలని కర్టు మిటీని కోకోరింది. ఆస్పత్రిపై దాడి చేసి బీభత్సం సృష్టించిన వారిని అరెస్ట్ చేసి, వారిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కోర్టు ఆదేశించింది. బాధితురాలి పోస్టుమార్టం నివేదికను కూడా న్యాయస్థానం కూలంకషంగా పరిశీలించింది.

# రియాల్టీకి రియల్ సపోర్ట్

- రాష్ట్రాభివృద్ధిలో మీరంతా భాగస్వాములే
- క్రెడాయ్ స్టేట్కాన్-2024లో మంత్రులు ఉత్తమ్, కోమటిరెడ్డి భరోసా



హైదరాబాద్ : రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం అభివృద్ధికి ప్రభుత్వపరంగా పూర్తి సహాయ, సౌకర్యాలు అందిస్తామని మంత్రులు ఉత్తమ్కుమార్రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి భరోసా ఇచ్చారు. కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్స్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) ఆధ్వర్యంలో మంగళవారంనాడిక్కడి హైదరాబాద్ ఇంటర్నేషనల్ కన్వెన్షన్ సెంటర్ (హెచ్ఐసీసీ)లో 'తెలంగాణ గోయింగ్ గ్లోబల్' అంశంపై స్టేట్కాన్-2024 పేరుతో రాష్ట్రస్థాయి సదస్సు నిర్వహించారు. రాష్ట్రం నలుమూలల నుంచి పెద్దసంఖ్యలో క్రెడాయ్ సభ్యులు హాజరైన ఈ సదస్సును మంత్రులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో అనేక అభివృద్ధి పథకాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందనీ, మూసీ రివర్ ఫ్రంట్ వంటి అనేక ప్రాజెక్టులు దీనిలో ఉన్నాయని వివరించారు. గతంలో ఔటర్ రింగ్రోడ్డును మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి నిర్ణీత గడువులో నిర్మించారనీ, మాజీ సీఎం చంద్రబాబు నాయుడు చేపట్టిన పనుల్ని కొనసాగిస్తూ, మరో స్టేజ్కు తీసుకెళ్లారని గుర్తుచేశారు. ముచ్చెర్లలో ఫోర్త్ సిటీ నిర్మాణం చేపడుతున్నామనీ, రాజధానికి దక్షిణభాగంలోనూ అభివృద్ధి జరగాలనే ఉద్దేశ్యంతో ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధిలో తెలంగాణ బిల్డర్లు భాగస్వాములేననీ, వారికి తామంతా 24 గంటలు అందుబాటులో ఉంటామని చెప్పారు. అభివృద్ధిని ఒకే ప్రాంతంలో కేంద్రీకృతం చేయబోమన్నారు. రియల్టర్ల సమస్యల్ని తప్పకుండా ముఖ్యమంత్రి ఏ రేవంత్రెడ్డి దృష్టికి తీసుకెళ్లి, పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రానికి పెద్ద సంఖ్యలో విదేశీ పెట్టుబడులు వస్తున్నాయనీ, వాటి విస్తరణలో రాష్ట్ర బిల్డర్ల పాత్ర ప్రముఖంగా ఉంటుందని చెప్పారు. పరిశ్రమలు, శిక్షణా సంస్థలు వస్తే, దాని చుట్టూ నివాస గృహాలు వస్తాయనీ, వాటిని నిర్మించి, ప్రజలకు అందించాల్సిన బాధ్యత క్రెడాయ్ వంటి సంస్థలపై ఉంటుందని అన్నారు. కార్యక్రమానికి క్రెడాయ్ తెలంగాణ శాఖ చైర్మెన్ మురళీకృష్ణారెడ్డి అధ్యక్షత వహించారు. ఆ సంస్థ అధ్యక్షులు ఈ ప్రేంసాగర్రెడ్డి, ఎలక్టెడ్ ప్రెసిడెంట్ కే ఇంద్రసేనారెడ్డి, కార్యదర్శి జీ అజయ్ కుమార్, ఉపాధ్యక్షులు గోవర్ధన్రెడ్డి, పురుషోత్తంరెడ్డి, బీ పాండురంగారెడ్డి, యూత్వింగ్ కోఆర్డినేటర్లు సీ సంకీర్త్, ఆదిత్యారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

PRINTED, PUBLISHED & OWNED BY CHERUKU UPENDAR, PRINTED AT AKSHAYA PRINTERS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EDITOR: CHERUKU UPENDAR, PUBLICATIONS AT HAMSA PUBLICATIONS, H.NO.7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR (V), ABDULLAPURMET (M), HAYATH NAGAR-501 505, RANGAREDDY DIST/HYDERABAD CITY, TELANGANA. EMAIL: PRABHATHASURYUDUEDITOR@GMAIL.COM, RNI: TELTEL12215